గోషామహల్‌లో బీఆర్‌ఎస్‌కు మరో షాక్

బీజేపీలో చేరిన ఆల పురుషోత్తమ్ రావు


ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ సమక్షంలో బీజేపీలో చేరిన ఆల పురుషోత్తమ్ రావు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు మరో షాక్ తగిలింది. సీనియర్ బీఆర్‌ఎస్ నాయకుడు తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. గత కొన్ని నెలలుగా పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం గోషామహల్ నియోజకవర్గంలో రెండుసార్లు కార్పొరేటర్ పోటీ చేసి స్థానిక ప్రజల్లో మంచి పట్టు ఉన్న నాయకుడు ఆల పురుషోత్తమ్‌రావు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కట్టెలమండిలోని కాశీ విశ్వేశ్వర ఆలయంలో దాదాపు 200 మంది అనుచరులతో కలిసి పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ప్రదర్శనగా రాష్ట్ర బీజేపీ కార్యాలయానికి చేరుకొని బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అబద్ధాల, అసత్యాల పార్టీగా మారిందన్నారు. ఎలాంటి గ్యారంటీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. అనంతరం పురుషోత్తమ్‌రావు మాట్లాడుతూ..కేంద్రంలోని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పథకాలను ఆకర్షితులై బీజేపీలో చేరుతున్నట్లు వెల్లడించారు. ప్రజలంతా బీజేపీ వైపే మొగ్గు చూపుతున్నారన్నారు. తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, కార్పొరేటర్లు భీక్ష్వ సురేఖ, లాల్‌సింగ్, శంకర్ యాదవ్, బీజేపీ నాయకులు రఘునందన్‌యాదవ్, లడ్డూ యాదవ్, నంద్‌కర్, భీక్ష్వ ఓంప్రకాష్, గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాండుయాదవ్, గోవింద్‌రాఠి పాల్గొన్నారు.

మానవ సేవే మాధవ సేవ


బండారు సుబ్బారావు దంపతులకు పురస్కారాన్ని అందజేస్తున్న దామోదర్ గుప్తా తదితరులు

గన్‌ఫౌండ్రీ: మానవ సేవే మాధవ సేవ అని సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు అన్నారు. శృతిలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు సుబ్బారావు, మనోహరి దంపతులకు ఆదర్శ దంపతులు పురస్కారాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..సమాజం బాగుంటే మనం బాగుంటామన్నారు. శృతిలయ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని మాట్లాడుతూ.. నిరుపేదలు, కేన్సర్ బాధితులకు, నిరాశ్రాయులకు ఆయన చేస్తున్న సేవలు ఎనలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దామోదర్ గుప్తా, కుసుమ బోగరాజు, సుభాష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన


బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. సోమవారం కార్వాన్ ఉప్పర్ బస్తీలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీజేపీ పాలనలో మన దేశం ప్రపంచ అగ్రదేశాల సరసన నిలిచిందన్నారు. మరోవైపు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరంలోపే తన అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు మూసీ ప్రవాహంలో ఎప్పుడో కొట్టుకుపోయాయని కేవలం డబ్బుల మూటలను మోసే నాయకుడిగా సీఎం రేవంత్‌రెడ్డి తయారయ్యారని ఆయన ఆరోపించారు. అందువల్లే ప్రజలు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దాన్ని పని విధానాన్ని అసహించుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గోదా లక్ష్మీకాంత్‌యాదవ్ తదితరులున్నారు.

కల్తీ ఆహారంపై ఉక్కుపాదం మోపాలి


మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు

సుల్తాన్‌బజార్: కల్తీ ఆహారంపై జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉక్కుపాదం మోపాలని బీఆర్‌ఎస్ గోషామహల్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గౌలిగూడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశంలో కల్తీ ఆహారంలో 18 నగరాలలో నెంబర్:1 స్థానంలో హైదరాబాద్ నగరం ఉండడం ఎంతో ఆందోళనకరమైన విషయమన్నారు. కాంగ్రెస్ హయాంలో కల్తీ ఆహారంపై అధికారులు ఉదాసీనతగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా ఉందో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ సమస్యను సర్కిల్–14 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ విద్యాధర్ దృష్టికి తీసుకువెళ్లినా ఆయన ఒక్కరోజు కూడా రోడ్డుపైకి వచ్చి సమస్యలను పరిశీలించిన పాపాన పోలేదన్నారు. ఏఎంహెచ్‌ఓ వెంకటరమణ, టౌన్‌ప్లానింగ్ అధికారులు కూడా ఇదే కోవలో నడుస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు కల్తీ ఆహారంపై దృష్టి సారించి కల్తీ జరుగకుండా సత్వర చర్యలు చేపట్టాలని కోరారు. లేని పక్షంలో జీహెచ్‌ఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అహ్మద్, మహేష్ గౌడ్, నరేష్ గౌడ్, విజయ్ ముదిరాజ్, మహేష్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు పాటల పోటీలు


ఓం ప్రకాష్‌ను సన్మానిస్తున్న డాక్టర్ రియాజ్ తదితరులు

అఫ్జల్‌గంజ్: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం అఫ్జల్‌గంజ్‌లోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వారోత్సవాలలో భాగంగా ఐదవ రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా సంగీత వాయిద్య కళాకారుడు ఓంప్రకాష్ వ్యవహరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రియాజ్ ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముఖ్య గ్రంథ పాలకురాలు పీజీవి రాణి, సి.అపర్ణ పాల్గొన్నారు.

గర్భిణులకు పండ్లు పంపిణీ


గర్భిణులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేస్తున్న దృశ్యం

గోల్కొండ: గర్భిణులు బలవర్ధకమైన ఆహారం తీసుకుంటే వారికి పుట్టబోయే పిల్లలు ధృడంగా ఉంటారని గుడిమల్కాపూర్‌లోని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కావ్య అన్నారు. సోమవారం ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్‌లో భాగంగా మహిళలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు క్రమం తప్పకుండా ప్రతి నెల ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే పురుళ్లు చేసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం గర్భిణులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవర వంశీ, అనిల్ తదితరులున్నారు.

ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కార్యాలయాలను విస్తరిస్తాం


మహ్మద్ నజీబ్, నేమ్‌సింగ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ కార్యాలయాలను తెరుస్తామని ఐహెచ్‌ఆర్‌వో తెలంగాణ చైర్మన్, పీస్ అంబాసిడర్ మహ్మద్ నజీబ్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకి అక్బర్‌బాగ్‌లోని ఐహెచ్‌ఆర్‌వో కార్యాలయంలో సమాజ సేవా రంగంలో విశిష్ట సేవలు అందించిన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఐహెచ్‌ఆర్‌వో జాతీయ చైర్మన్ నేమ్‌సింగ్ మాట్లాడుతూ..15 ఏళ్లుగా మహ్మద్ నజీబ్ హైదరాబాద్‌లో సమాజ సేవా కార్యక్రమాలతో పాటు ఫ్యామిలీ కౌన్సెలింగ్‌ను కూడా అత్యంత సమర్థంగా నిర్వహిస్తున్నారన్నారు. అయితే తెలంగాణలోని మరిన్ని ప్రాంతాలకు తమ కార్యక్రమాలను, కార్యాలయాలను విస్తరించేందుకు మహ్మద్ నజీబ్ ఎంతో ఆసక్తిగా ఉన్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్, ఖాలేద్ ఆలీఖాన్ తదితరులున్నారు.

పాతబస్తీలో పోకిరీలతో పరేషాన్

- మత్తు పదార్థాలకు బానిసవుతున్న యువత
- అకారణంగా దాడులు.. ఆటో డ్రైవర్ల నుంచి మామూళ్ల డిమాండ్
- పోలీసుల నిఘా పెంచాలని ప్రజల డిమాండ్
- నడిరోడ్డుపై దాడికి పాల్పడిన యువకుడి రిమాండ్


నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు


నిత్యం ఆటోలతో రద్దీగా చార్మినార్ ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు

చార్మినార్: చార్మినార్ ఆర్టీసీ బస్టాఫ్ రోడ్డులో హంగామా సృష్టించిన యువకుడిని మొఘల్‌పురా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పూర్తిగా మద్యం/గంజాయి మత్తులో ఉన్న ఓ యువకుడు మామూళ్లు ఇవ్వాలంటూ చార్మినార్ ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులో పార్కింగ్ చేసిన ఓ ఆటో డ్రైవర్‌పై కర్రలతో దాడికి పాల్పడి న్యూసెన్స్ క్రియేట్ చేసిన విషయం తెలిసిందే. విషయం తెలిసిన వెంటనే సంబంధిత మొఘల్‌పురా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగించారు. మొగల్‌పురా ఇన్‌స్పెక్టర్ నాగదుర్గ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. బార్కాస్‌లోని సలాలకు చెందిన షేక్ ముబారక్ ఖురేషీ(20) అనే యువకుడు మద్యం మత్తులో ఆటో డ్రైవర్‌ను డబ్బులు కావాలంటూ డిమాండ్ చేయడం.. అందుకు అతను అంగీకరించకపోవడంతో కర్రతో దాడికి పాల్పడ్డాడు. నిందితుడిని అరెస్టు చేసి 4వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ డీసీ ఉమాపతి రావు నిందితుడికి 30 రోజుల పాటు సాధారణ జైలు శిక్ష విధించారు.

పోకిరీల బెడద తగ్గించాలి..

పాతబస్తీలో చార్మినార్‌తో పాటు పరిసర ప్రాంతాలు పర్యాటక ప్రదేశాలు. దేశ, విదేశాల పర్యాటకులు సైతం ఇక్కడికి ప్రతిరోజూ వస్తుండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇదే అవకాశంగా భావిస్తున్న జులాయిగా తిరిగే కొంత మంది యువకులు మద్యం, గంజాయి, వైట్నర్ సేవిస్తూ న్యూసెన్స్‌కు పాల్పడుతున్నారు. అంతేకాకుండా అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు కొంత కాలంగా వస్తున్నాయి. ముఖ్యంగా ఆటో డ్రైవర్లతో పాటు ఫుట్‌పాత్‌లపై చిరువ్యాపారాలు నిర్వహించే వారిని ఈ పోకిరీలు టార్గెట్‌గా చేసుకుని డబ్బులు డిమాండ్ చేస్తూ దౌర్జన్యాలకు దిగుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారు. గంజాయి బ్యాచ్ నుంచి తమను కాపాడాలని ఆటో డ్రైవర్లతో పాటు స్థానిక చిరు వ్యాపారులు కోరుతున్నారు.

ఎక్కువైన వైట్నర్, గంజాయి బ్యాచ్..

చార్మినార్ కట్టడానికి ఇరువైపులా వైట్నర్, గంజాయి సేవించే జులాయి బ్యాచ్ ఎక్కువైంది. గతంలో వైట్నర్ వాడే యువకులు ప్రస్తుతం విచ్చలవిడిగా గంజాయి వినియోగిస్తూ మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. ఈ జాఢ్యం కేవలం జులాయిగా తిరిగే బ్యాచ్‌లకే కాకుండా కొంత మంది ఆటో డ్రైవర్లు సైతం వినియోగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. గంజాయి మత్తులో అకారణంగా పర్యాటకులపై దాడులకు సైతం పాల్పడుతున్నారని చెబుతున్నారు. ఈ మేరకు స్థానిక పోలీసు స్టేషన్లలో కేసులు కూడా నమోదయ్యాయి.

మత్తు పదార్థాల సరఫరా ఎక్కడి నుంచి..ఎలా..?

అయితే ఇప్పుడు విచ్చలవిడిగా లభిస్తున్న గంజాయి మత్తుకు బానిసలవుతున్నారు. వీరికి మత్తు పదార్థాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఎలా లభిస్తున్నాయి? అందజేస్తున్న వారెవరు..? అనే విషయాలపై సంబంధిత పోలీసులు దృష్టి సారించడం లేదు. ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదనే కుంటిసాకులతో సంబంధిత పోలీసులు సమస్యను పక్కదారి పట్టిస్తున్నారు. పాతబస్తీ శివారు, ప్రధాన రోడ్లలో మాత్రమే డీడీ(డ్రంక్ అండ్ డ్రైవ్) నిర్వహిస్తున్న పోలీసులు ఇలాంటి సున్నితమైన ప్రాంతాల్లో ఎందుకు నిర్వహించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ సుల్తాన్‌బజార్, తారకరామా విద్యుత్ ఫీడర్ల పరిధిలోని సుల్తాన్‌బజార్, ప్రగతి కాలేజ్, కేస్ లైన్, హనుమాన్‌టేకీ, శాలిమార్ ఫంక్షన్‌హాల్, జాగృతి కాలేజ్, రాంకోఠి చౌరస్తా తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే రాంకోఠి, మహేశ్వరీ పరమేశ్వరీ ఫీడర్ల పరిధిలోని ఏసీపీ కార్యాలయం, బాలాజీ దాబా, శంశేర్‌బాగ్, కాచిగూడ బిగ్‌బజార్, తారకరామ థియేటర్, మహంకాళి ఆలయం, వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు తెలిపారు.

ఫుట్‌పాత్ కబ్జాలపై స్పెషల్ డ్రైవ్

గోల్కొండ: ఫుట్‌పాత్ ఆక్రమణలపై ట్రాఫిక్, బల్దియా అధికారులు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా టోలిచౌకీ, సలార్‌జంగ్ కాలనీ, ఫ్లోర్ మిల్–లంగర్ హౌస్ రోడ్డు, పాత ముంబై జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై వెలిసిన స్టాల్స్‌ను తొలగించారు. సాలర్‌జంగ్ కాలనీ వద్ద ఫుట్‌పాత్‌పై ఇసుక, ఇటుక, కంకరను తొలగించాలని వాటిని అమ్మే వారిని హెచ్చరించారు. ఫుట్‌పాత్‌లపై తొలగించిన వాటిని మళ్లీ కబ్జా చేస్తే వారిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేస్తామని పోలీసులు స్పష్టం చేశారు.

జూపార్కు క్యూరేటర్‌గా వసంత

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్కు క్యూరేటర్‌గా జె.వసంత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేస్తున్న డాక్టర్ సునీల్ ఎస్.హిరేమత్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో వసంత బాధ్యతలు చేపట్టారు. ఐఎఫ్‌ఎస్ అధికారి అయిన ఆమె ప్రస్తుతం జయశంకర్ భూపాల్‌రెడ్డి జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. క్యూరేటర్‌గా బాధ్యతలు తీసుకున్న తరువాత ఆమె జూపార్కును తిరిగి చూశారు. జూపార్కు నిర్వహణ గురించి అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అధికారులు, సిబ్బంది సహకారంతో జూపార్కును దేశంలోనే నంబర్ వన్ జూగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానన్నారు.

మంగళ్‌హాట్‌లో ఏఎస్‌ఐపై దాడి

అబిడ్స్: ఏఎస్‌ఐపై దాడికి పాల్పడిన ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..అప్పర్ ధూల్‌పేట సమీపంలోని బాబా బాలక్‌దాస్ మఠ్ ప్రాంతానికి చెందిన చోటూసింగ్(26) గంజాయి విక్రేత. శనివారం అర్ధరాత్రి తాగిన మైకంలో అదే ప్రాంతానికి చెందిన రాజాసింగ్(37)తో గొడవకు దిగాడు. రాజాసింగ్ కుమారులు సిద్ధాంత్, అరుణ్‌సింగ్ అడ్డుకునే ప్రయత్నం చెయ్యగా ఇంట్లోకి వెళ్లి కొబ్బరి బోండం కత్తి తీసుకువచ్చి వారిపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో సిద్ధాంత్, అరున్‌సింగ్‌కు గాయాలయ్యాయి. స్థానికులు 100కు డయల్ చేయగా ఘటనా స్థలానికి చేరుకున్న మంగళ్‌హాట్ ఏఎస్‌ఐ శ్రీనివాస్‌పై కూడా చోటుసింగ్ పిడిగుద్దులు గుద్దడంతో ఏఎస్‌ఐ ముఖం, కంటికి గాయాలయ్యాయి. పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన సిద్ధాంత్, అరుణ్‌సింగ్, ఏఎస్‌ఐ శ్రీనివాస్‌ను ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రార్థనా మందిరాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి


సమావేశంలో ఏసీపీ మునావర్, ఇన్‌స్పెక్టర్ రాజు

అబిడ్స్: అన్ని ప్రాంతాల్లోని ప్రార్థనా మందిరాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కుల్సుంపురా ఏసీపీ మునావర్ పేర్కొన్నారు. గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన మైత్రి సభ్యులు, ఆలయాల నిర్వాహకులు, మజీద్‌ల నిర్వాహకుల సమావేశానికి ఏసీపీ మునావర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకొని సమాజ సంక్షేమం కోసం సహకరించాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు చేయడం ద్వారా ఎలాంటి నేరాలు, ఇతర సంఘటనలు జరగవన్నారు. ఇన్‌స్పెక్టర్ బి.రాజు మాట్లాడుతూ..గత కొన్ని సంవత్సరాలుగా సీసీ కెమెరాల ద్వారానే ఎన్నో దొంగతనాలు, పెద్ద పెద్ద సంఘటనలు పోలీస్ శాఖ ఛేదించిందన్నారు. 24 గంటల పాటు సీసీ కెమెరాల ద్వారా ప్రార్థన స్థలాల వద్ద పర్యవేక్షణ చేస్తే శాంతిభద్రతల సమస్య ఏ మాత్రం ఉత్పన్నం కాదన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే గోషామహల్ అభివృద్ధి


బేగంబజార్‌లో పర్యటిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్

అబిడ్స్: బీఆర్‌ఎస్‌తోనే గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధి జరిగిందని నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం బేగంబజార్‌లో బస్తీబాట నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి చరమగీతం పాడే రోజులు సమీపిస్తున్నాయన్నారు. అన్నివర్గాల ప్రజలు బీఆర్‌ఎస్‌వైపే ఉన్నారన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోటి శైలేష్ కురుమ పాల్గొన్నారు.

ప్రజావాణికి స్పందన కరువు


ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న జోనల్ కమిషనర్ వెంకన్న

చార్మినార్: జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టీ.వెంకన్న ఆధ్వర్యంలో సోమవారం జోనల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజావాణి కార్యక్రమంలో తమకు అందిన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో బస్తీ, కాలనీవాసులు స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదులను పరిశీలించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్, ఏఎంసీ రాజారావు, ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, యూబీడీ మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి సంఘం సభ్యులకు ప్రశంసా పత్రాలు అందజేత


మౌజమ్ అలీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్న డీజే గోపాల్

జియాగూడ: పండుగలు శాంతియుతంగా నిర్వహించడానికి కృషి చేసిన సభ్యులకు ప్రతీ ఏటా ప్రశంసాపత్రాలను అందజేసి సన్మానిస్తామని సౌత్ వెస్ట్ జోన్ సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మౌజమ్ అలీ అన్నారు. ఈ మేరకు సోమవారం కుల్సుంపురాలో జరిగిన శాంతి సంగం సభ్యులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన రంజాన్, బోనాలు, మొహర్రం, గణేష్, దేవి నవరాత్రి వేడుకలు శాంతియుతంగా జరిగేందుకు శాంతి సంగం సభ్యుల కృషి హర్షణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో డీజే గోపాల్, శివలాల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సమగ్ర కుటుంబ సర్వే దేశానికి ఆదర్శం



గౌలిపురా: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే దేశానికి ఆదర్శమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నిజామాబాద్‌కు చెందిన ఉపాధ్యాయులు రుద్రంగి రమేశ్ మేరు కులగణనపై ప్రత్యేకంగా రచించి రూపొందించిన గీతాన్ని, సీడీని మంత్రి సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను భవిష్యత్తులో దేశం మొత్తం రోల్ మోడల్‌గా తీసుకుంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేను అడ్డుకునేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, రాష్ట్ర మేరు సంఘం నాయకులు కె.వెంకటేశ్, కీర్తిరాజ్‌గోపాల్ పాల్గొన్నారు.

సబ్జిమండిలో 'రూమ్ టు రీడ్' ప్రచారం


బ్రోచర్ విడుదల చేస్తున్న ఇన్‌స్పెక్టర్ సునీల్

జియాగూడ: అమ్మాయిలు తప్పనిసరిగా చదువుకోవాలని కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ సునీల్ అన్నారు. ఈ మేరకు సోమవారం రూమ్ టు రీడ్ బస్తీ ప్రచారంలో భాగంగా బ్రోచర్, డిజిటల్ ఆటోలను ఇన్‌స్పెక్టర్ సునిల్ చేతుల మీదుగా విడుదల చేశారు. ప్రచారంలో సబ్జిమండి స్కూల్ విద్యార్థులు, పోలీస్ సిబ్బంది ఉన్నాయి. ఈ కార్యక్రమంలో రూమ్ టు రీడ్ సీనియర్ ఆఫీసర్ సరితా, ప్రతినిధులు యమున, పీఎల్‌వి. మాధవి తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడికి ఇందిరాగాంధీ ఎక్సలెన్సీ అవార్డు ప్రదానం


మహేష్‌కుమార్ గౌడ్‌కు అవార్డు అందజేస్తున్న డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ తదితరులు

చార్మినార్: తెలంగాణ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో సోమవారం టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్‌కు ఇందిరాగాంధీ ఎక్సలెన్సీ అవార్డు–2024ను ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ అందజేశారు. నార్సింగిలోని ఆయన నివాసంలో జ్ఞాపిక, శాలువా, పూలమాలలతో సత్కరించి అవార్డు అందజేశారు. ఈ కార్య క్రమంలో ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యులు, ప్రముఖ న్యాయవాది జి.సీతారామ రాజు, టీపీసీసీ కార్యదర్శి బి.వెంకటేష్ ముదిరాజ్‌లతో పాటు డాక్టర్ మహ్మద్ అక్తర్ అలీ, బత్తుల హేమంత్, ప్రవీణ్‌కుమార్, నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికే సమగ్ర కుటుంబ సర్వే


సర్వేలో మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్

అబిడ్స్: ప్రజా సంక్షేమానికే కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేపడుతుందని ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్ పేర్కొన్నారు. మంగళ్‌హాట్‌లోని పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించి సర్వే వివరాలు తెలుసుకున్నారు. ఎన్యూమరేటర్లకు పూర్తిగా సహకారం అందించి సర్వే జరిగే ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం పరమేశ్వరీ సింగ్ మాట్లాడుతూ..కులగణతో పాటు రాష్ట్ర ఆర్థిక, సామాజిక స్థితిగతులు కూడా సర్వే ద్వారా ప్రజలకు తెలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో శశిరాజ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ


పూజలో మామిడి నర్సింగ్‌రావు, మామిడి లక్ష్మీభాయ్ తదితరులు

గోల్కొండ: షేక్‌పేట్ ద్వారకానగర్‌లో సోమవారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ భక్తిశ్రద్ధలతో జరిగింది. పి.కేశవ్ గురుస్వామి ఆధ్వర్యంలో ఈ పూజ నిర్వహించారు. మామిడి నర్సింగ్‌రావు గురుస్వామి, కన్నెస్వామి మామిడి లక్ష్మీభాయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పడి పూజలో పరిసర ప్రాంతాల నుంచి అయ్యప్ప భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పంచశీల భజన మండలి వారి భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి. గురుస్వామి మామిడి ప్రభాకర్, గంట స్వామి మామిడి శ్రీకాంత్, కన్నెస్వామి మామిడి క్రిష్, కన్నెస్వామి మామిడి హర్షాలీ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు


విజేతలతో కోచ్ సయ్యద్ హబీబ్ ముస్తఫా

చార్మినార్: హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్–2024 పోటీలలో పాతబస్తీ హబీబ్ ముస్తఫా బాక్సింగ్ అకాడమీకి చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచి అత్యధిక సంఖ్యలో బంగారు, వెండి మెడల్స్ సాధించారు. 12 బంగారు, 2 వెండి మెడల్స్ సాధించిన విజేతలను సోమవారం అకాడమీకి చెందిన కోచ్ హబీబ్ ముస్తఫా అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో షేక్‌పేట్‌లోని జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో హబీబ్ ముస్తఫా బాక్సింగ్ అకాడమీకి చెందిన విద్యార్థులు సైతం పాల్గొని బంగారు, వెండి మెడల్స్ సాధించారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో జరుగనున్న బాక్సింగ్ చాంపియన్‌షిప్ ఎంపిక కోసం ఈ పోటీలు జరిగాయని అంతర్జాతీయ మాస్టర్స్ బాక్సింగ్ చాంపియన్‌షిప్–2024 సిల్వర్ మెడలిస్ట్, కోచ్ సయ్యద్ హబీబ్ ముస్తఫా తెలిపారు.